


నిబంధనల పేరిట రైతులకు ఇబ్బందులు

- స్లాట్ బుక్ చేసుకున్నా సమస్యలే..
- రోడ్డెక్కిన పత్తి రైతులు
- కర్నూలు-కోడుమూరు రహదారిలో భారీగా వాహనాలు



రోడ్డుపై పత్తి వాహనాలు ఆపేసి ఆందోళనకు దిగిన రైతులు

కొర్రీల సీసీఐ

(ఆంధ్రజ్యోతి, కర్నూలు)

భారీ వర్షాలు, తుపాన్‌లతో తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులను సీసీఐ మరింతగా వేధిస్తోంది. అనేక సాకులతో కొర్రీలు పెట్టి ఇబ్బందులపాలు చేస్తోంది. అరకొరగా చేతికి వచ్చిన పత్తిని అమ్ముకుందామంటే సీసీఐ రోజుకో మాట చెప్పి ఆందోళనకు గురి చేస్తోంది. రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ రోజుకో నిబంధన జారీ చేస్తుండటంతో పత్తి విక్రయాలకు అటంకాలు కలుగుతున్నాయి. సోమవారం వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు గూడూరు మండలం పెంచికలపాడు పత్తి జిన్నింగ్ కేంద్రంలోని సీసీఐ కేంద్రానికి వాహనాల్లో పత్తి తీసుకొని చేరుకున్నారు. ఉదయం 8.30 గంటలకు అధికారులు కొనుగోలు ప్రారంభించారు. ఎకరాకు ఆరు క్వింటాళ్లు మాత్రమే కొంటామని, ఇది ప్రభుత్వ తాజా నిర్ణయమని అన్నారు. ముందస్తుగా రైతులు స్లాట్ బుక్ చేసుకున్నా.. తమ కంప్యూటరులో చూపడం లేదని, కాబట్టి పత్తి కొనమని తేల్చి చెప్పారు. దీంతో ఆగ్రహించిన పత్తి రైతులు ఎకరాకు పది క్వింటాళ్ల నిబంధనతో ఆన్‌లైన్‌లో ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకున్నామని, ఇప్పుడు మళ్లీ కొత్త నిబంధనల పేరుతో అన్యాయం చేస్తారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. కర్నూలు-కోడుమూరు ప్రధాన రోడ్డుపై పత్తి వాహనాలు అడ్డం పెట్టి ధర్నాకు దిగారు. సీసీఐ కేంద్రాన్ని ముట్టడించారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. గంటకు పైగా రాస్తారోకో చేయడంతో వాహనాలు బారులు తీరాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, సీసీఐ గుంటూరు జనరల్ మేనేజర్‌తో మాట్లాడి తక్షణమే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.

● **ట్రాఫిక్‌లో ఇరుక్కున్న ఎంపీ బస్తిపాటి :** ఆలూరు మండలం పెద్దహొత్తూరులో జరిగే ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు బయలుదేరారు. పెంచికలపాడుకు చేరుకోగానే రైతుల ధర్నాతో వాహనాలు బారులు తీరడంతో ఎంపీ ట్రాఫిక్‌లో ఇరుక్కున్నారు. అక్కడి నుంచి సీసీఐ కేంద్రానికి వెళ్లి రైతులతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, గుంటూరులో ఉంటున్న సీసీఐ కేంద్రం మేనేజర్‌కు ఫోన్లు చేసి నిబంధనలు, సాంకేతిక సమస్యల పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, తక్షణమే కొనుగోలు చేపట్టాలని గట్టిగా నిలదీశారు. ఎట్టకేలకు సీసీఐ అధికారులు కొనుగోలు చేసి తుకాలు వేస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

స్లాట్ బుక్ చేసుకున్నా తూకాలు వేయమన్నారు



పెంచికలపాడు వద్ద ఉన్న జిన్నింగ్ పరిశ్రమలోని సీసీఐ కేంద్రంలో పత్తి అమ్మకానికి స్లాట్ బుక్ చేసుకున్నాం. సోమవారం 30 క్వింటాళ్ల పత్తి తీసుకువచ్చాను. ఇక్కడ మా వివరాలు లేవని, పత్తి కొనుగోలు చేయమని సీసీఐ అధికారులు చెబుతున్నారు.

-మధు, కె. మార్కాపురం, కల్లూరు మండలం

నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు



పత్తి ధరలు పతనమయ్యాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాలకు అమ్ముదామని వస్తే.. నిబంధనల పేరుతో కొర్రీలు పెడుతున్నారు. ఎకరాకు 6 క్వింటాళ్ల మించి తీసుకోమంటున్నారు. రైతులంటే అధికారులకు అలుసుగా మారింది.

- ఆర్. రామకృష్ణ, పత్తిరైతు, కల్లూరు మండలం



సీసీఐ ఆఫీసుకు ముట్టడించిన రైతులు

జిల్లాలో రైతులు 2.20 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా అతివర్షాలు, తుఫాన్లు నిండా ముంచేశాయి. అధిక తేమకు కుళ్ల తెగుళ్ల సోకి పంట భారీగా దెబ్బతిన్నది. ఎకరాకు ఇప్పటికే రైతులు నాలుగైదు క్వింటాళ్ల నష్టపోయారు. అరకొర దిగుబడులు అమ్ముదామని మార్కెట్‌కు వెళితే.. క్వింటాల్ రూ.3,500 నుంచి రూ.7వేలకు మించి పలకడం లేదు.



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

రాయలసీమలోనే అతి పెద్ద మార్కెట్ ఆదోనిలో పత్తిదారులు పతనమై రైతులు కుదేలయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8,110కు కొనుగోలు చేసేందుకు సీసీఐ ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మండలంలోని పెంచికలపాడు జిన్నింగ్ పరిశ్రమలలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాయి. సోమవారం సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకురావాలంటూ రైతులకు మెసేజీలు కూడా వచ్చాయి. దాదాపు 65 మంది రైతులు పత్తి వాహనాలతో ఉదయం 6.30 గంటలకే పెంచికలపాడు వద్ద ఉన్న కాటన్ జిన్నింగ్ పరిశ్రమలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లారు. 8.30 గంటలకు వచ్చిన సీసీఐ అధికారులు స్లాట్ బుక్ చేసుకున్న వివరాలు తమ కంప్యూటర్‌లో కనిపించడం లేదని, పత్తి తూకాలు వేయడం లేదని తేల్చి చెప్పారు. పత్తి వెనక్కి తీసుకెళ్లాలంటే రెండుసార్లు లారీ బాడుగలు భరించాల్సి వస్తుందని సీసీఐ కేంద్రాన్ని ముట్టడించారు.

ఆలయాలకు కార్తీక శోభ



కర్నూలు నగరంలోని లలితాపీఠంలో కోలాట ప్రదర్శన

కర్నూలు కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. వివిధ ఆలయాల్లో, ధార్మిక క్షేత్రాల్లో కార్తీక మాస దీపోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సామూహికంగా తరలి వచ్చిన ఈ దీపోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. కర్నూలులోని పాతనగరంలోని శ్రీలలితా పీఠంలో పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్య స్వామి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం లలితాదేవికి, సుందర స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు, అష్టోత్తర పారాయణాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో దీపోత్సవాల్లో పాల్గొన్నారు. కర్నూలు నగరంలోని హరిహర క్షేత్రం, కొత్తపేటలోని రామాలయం, శివాలయం, షిరిడీ సాయి బాబా మందిరం, పాతనగరంలోని శివాలయం, పేట రామాలయం, నిమిషాంబాదేవి ఆలయం, అశోక్‌నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయం, హనుమాన్, ద్వారకామాయి ఆలయం, కేసీ కెనాల్ సమీపంలోని సత్యనారాయణ స్వామి ఆలయాల్లో మహిళలు సామూహిక దీపోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు.





కర్నూలు నగరంలో కార్తీక వేడుకల్లో పాల్గొన్న యువతులు

గుంతకల్లు- హుబ్లీ మధ్య కొత్త రైలు



ఆదోని టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు, హుబ్లీ మధ్యలో జీపీఎస్ సౌకర్యం ఉన్న ఎలక్రిక్ ట్రైన్‌ను ప్రభుత్వం కొత్తగా నడుపుతున్నది. ఆదోని పట్టణం నుండి బళ్ళారి, హొస్పేట్, హుబ్లీ, ధార్వాడ్ తదితర కర్ణాటక ప్రాంతాలకు వెళ్లడానికి ఆదోని మీదుగా రైళ్లు లేకపోవడంతో ప్రజలు ఇంతకాలం ప్రైవేటు బస్సుల్లో వెళ్లేవారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఈ ఎలక్ట్రికల్ ట్రైన్ నడపడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైలు ప్రతి రోజు హుబ్లీలో ఉదయం 7:45కు బయలుదేరి మధ్యాహ్నం 2:30 గంటలకు గుంతకల్ జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరిగి గుంతకల్ నుండి మధ్యాహ్నం 3:30 గంటలకు బయలు దేరి రాత్రి 10:30కు హుబ్లీ సిటీకి చేరుకుంటుంది.

కోసిగి మండలానికి 16

సీజనల్ హాస్టళ్లు మంజూరు

కోసిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలానికి 16 సీజనల్ హాస్టళ్లను మంజూరు చేస్తూ కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బడులు బోసిపోతున్నాయి..' కథనానికి కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ శామ్యూల్ పాల్ విచారణ చేపట్టారు. కోసిగి మండలంలోని ప్రభుత్వ బడుల హాజరు శాతంపై సమీక్షలు చేసిన అధికారులు కోసిగి మండలానికి 16 సీజనల్ హాస్టళ్లు మంజూరు చేశారు. జుమాలదిన్నె, కోసిగి, చిర్తనకల్, డి.బెళగల్, జంపాపురం, పల్లెపాడు, దుద్ది, వందగల్లు, కందుకూరు, చిన్నభోంపల్లి పాఠశాలల పరిధిలో మొత్తం 16 హాస్టళ్లు మంజూరైనట్లు ఎంఈవో-1 బాలయ్య తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

● ఎంఎస్‌ఎంఈ ప్రతినిధుల నిరసన



ఐపీఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావాల్సిన బకాయి రాయితీలను తక్షణమే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) ప్రతినిధులు నిరసన చేపట్టారు. సోమవారం బిర్లా కూడలి సమీపంలోని జిల్లా పరిశ్రమల కేంద్రం ఎదుట ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రూన్యూర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధి త్రిమూర్తులు మాట్లాడుతూ ఐదేళ్లుగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు రావాల్సిన బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకపోయాయని ఆరోపించారు. ఇదేవిషయమై గత, ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు, అధికారులను పలుమార్లు సంప్రదించి విన్నవించిన ఫలితం లేదని వాపోయారు. ఐపీవో డానియేలుకు వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎంకు, కలెక్టర్‌కు సమస్యలను తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు మౌలాలి, రాజకుమార్, సుందర్, రాజేష్, దస్తగిరి పాల్గొన్నారు.

రైతులకు శుభవార్త

'అన్నదాత సుఖీభవ'లో
లోపాలు సవరణకు అవకాశం



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు కూటమి ప్రభుత్వం శుభవార్తను అందించింది. మొదటి విడత అన్నదాత సుఖీభవ నిధులను రైతులను అందించే సమయంలో వివిధ లోపాలు చోటుచేసుకున్నాయి. ఆధార్ కార్డుల్లో తప్పుల కారణంగా 'అన్నదాత సుఖీభవ' నిధులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఈ తప్పులను సవరించేందుకు అవకాశం ఇచ్చింది. నవంబరు 2వ వారంలో 'అన్నదాత సుఖీభవ' రెండో విడత నిధులను అందించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో ప్రధానంగా రైతుల ఆధార్ కార్డుల్లో చోటు చేసుకున్న తప్పులను ఉచితంగా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సరిదిద్దేందుకు నిర్ణయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5 లక్షల మంది రైతులు 'అన్నదాత సుఖీభవ' కింద అర్హులుగా ఉన్నారు. దాదాపు 20 నుంచి 30వేల మంది రైతుల ఆధార్ కార్డులో దొర్లిన తప్పులతో ఈ పథకం కింద మొదటి విడతలో ఆర్థికసాయం అందుకోలేక పోయారు. నవంబరు 2వ వారంలో పంపిణీ చేయనున్న ఈ పథకం నిధులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం ఆధార్ సీడింగ్, అక్షర దోషాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టింది. మొబైల్ నెంబర్, ఆధార్ సీడింగ్ కోసం లబ్ధిదారులు మీసేవా కేంద్రాల్లో రూ.50 చొప్పున చెల్లించాల్సి ఉండేది. రైతులను ఆదుకునేందుకు ఈ రూ.50 మొత్తాన్ని తీసుకోకుండా ప్రభుత్వమే భరించనుంది. దీనికి సంబంధించి రెండు రోజుల క్రితం రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



శ్రీకృష్ణసత్యభామ పౌరాణిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

కళలకు ఆదరణ అవసరం
శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య

వివరాలు 6లో

విచారించి న్యాయం చేస్తాం:ఎస్పీ

● పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 97 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 97 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

● తన హోండా షైన్ ద్విచక్రవాహనాన్ని కర్నూలు అవుట్ డోర్ స్టేడియం వద్ద తెలియని వ్యక్తి దొంగిలించాడని కర్నూలు మండలం ఈ-తాండ్రపాడు గ్రామానికి చెందిన బొల్లెద్దుల వెంకటసాయి క్రిష్ణ ఫిర్యాదు చేశారు.

● కర్నూలు మిలిటరీ కాలనీ వద్ద ఉన్న కరెంటు సబ్ స్టేషన్ ఆఫీసులో కరెంటు ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నంద్యాలకు చెందిన దుర్గాప్రసాద్ డబ్బులు తీసుకుని మోసం చేశాడని కర్నూలు మండలం నూతనపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు.

● తన పొలంలో పండించిన 220 ప్యాకెట్ల పత్తిని ఎత్తుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం, అలారుదిన్నె గ్రామానికి చెందిన వీరభద్ర ఆచారి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐలు శివశంకర్, ఇబ్రహీం, ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ అయ్యాక...

వ్యవసాయం చేస్తా..: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయం అంటే నాకు ఎంతో ఇష్టం. నేను కలెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాక వ్యవసాయం చేస్తా..' అని కలెక్టర్ డాక్టర్ సిరి అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని ఏ. క్యాంపులో ఉన్న ఉద్యాన భవనంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ట్రైనీ ఇంటర్నల్ క్లస్టర్ రీసోర్స్ పర్సన్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం అంటే తనకు చాలా ఇష్టమని, పదవి విరమణ పొందిన అనంతరం వ్యవసాయం చేస్తానని తెలిపారు. వైజాగ్‌లో తాను జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో సహజ వ్యవసాయం ఎక్కువగా అరకు, పాడేరు ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించామన్నారు. సహజ వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రజలు అనేక రోగాలతో సతమతమవుతున్నారని, నాణ్యత కలిగిన పంట ఉత్పత్తులపై ఆసక్తి పెంచుకుంటున్నారన్నారు. అందువల్ల రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించాలన్నారు. భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతుల మీదే ఉందన్నారు. పురుగుల మందులు ఎక్కువగా రైతులు ఉపయోగించడం వల్ల భూమి దెబ్బతింటుందని, కాలుష్యం పూర్తిగా కంట్రోల్ తప్పుతుందన్నారు. నేల సారవంతం కోల్పోయి దిగుబడి తగ్గిపోతాయన్నారు. **తాను జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన వెంటనే ఉల్లి సమస్యను ఎదుర్కోవడం జరిగిందన్నారు. మహారాష్ట్రతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల్లో ఉల్లి పంటను అధికంగా సాగు చేయడం వల్ల కర్నూలు జిల్లా ఉల్లికి డిమాండ్ తగ్గిందన్నారు.** ఈ సమావేశంలో జేడీ వరలక్ష్మి, ఇన్‌చార్జి ఉద్యాన శాఖ అధికారి మదనమోహన్ గౌడు, అసిస్టెంట్ డైరెక్టర్ శాలురెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ మాధురి పాల్గొన్నారు.

డెంగీతో బాలుడి మృతి

కోడుమూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాసం ఉంటున్న షేక్షావలి, హసీనా దంపతుల కుమారుడు రోషన్ (8) డెంగ్యీతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. షేక్షావలి స్వగ్రామ గోనెగండ్ల మండల ఎర్రబాడు కాగా పట్టణంలోని ఎరువుల దుకాణంలో పని చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు రోషన్ స్థానిక క్రీసెంట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. 20 రోజుల కిందట తీవ్రమైన జ్వరం రావడంతో ఆర్ఎంపీ వద్ద చిక్సిత చేయించారు. జ్వరం తగ్గక పోవడంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందాడు. విద్యార్థి మృతి పట్ల పాఠశాల యాజమాన్యం ఖాజావలి, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

సంజామల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అక్కంపల్లెలో అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్.ఐ రమణయ్య సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కుళాయి రెడ్డి (47) మృతదేహం పాలేరువాగులో లభ్యమైందన్నారు. ఈ నెల 2న కుళాయి రెడ్డి సంజామలకు వస్తుండగా పాలేరువాగు ప్రవాహానికి కొట్టుకుపోయాడు. మృతుడి భార్య శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా కొత్తపల్లె - సంజామల మధ్య పాలేరువాగులో మృతదేహం లభ్యమైంది. అక్కడే మృతదేహానికి అక్కడే శవ పరీక్ష చేయించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

డోన్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డోన్ నుంచి గుంతకల్లు రైల్వే లైన్ పట్టాల మధ్యలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 35 ఏళ్ల వయసు ఉంటుందని, మృతదేహం మీద నలుపు, తెలుపు రంగు డిజైన్ గీతల ఫుల్ హ్యాండ్స్ షర్టు, నశ్యం కలర్ ప్యాంట్, రెండు పొరల మొలతాడు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

హంద్రీ నీవాలో మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామం వద్ద హంద్రీనీవా కాలువలో మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివరాలు తెలసిన వారు 9121101065 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

- ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు కొట్టారని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన కోటేశ్వరరావు (21) కోలుకోలేక సోమవారం సాయంత్రం మృతి చెందాడు. వివరాల మేరకు.. గద్వాల జిల్లా మానోపాడు మండలం కొర్విపాడు చెందిన కోటేశ్వరరావును ఓ బాలిక అదృశ్యం కేసులో నాలుగో పట్టణ పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. తనను కొట్టారనే మనస్తాపానికి గురైన యువకుడు రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగిన విషయం విదితమే.. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. కోటేశ్వరరావు మృతికి పోలీసులే కారణమంటూ మృతుని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు నాగరాజురావు, శేషయ్య, పార్థసారథి, తేజోమూర్తి, తబ్రేజ్ సిబ్బందితో చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఎట్టకేలకురాత్రి 10 గంటలకు ఎ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. అయితే కేసు నమోదుపై స్పష్టత రాలేదు.

టీవీ మెకానిక్‌పై దాడి

పత్తికొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీవీ మెనానిక్ పులికొండపై సోమవారం దాడి జరిగింది. ఈ ఘటన సోమవారం రాత్రి పత్తికొండ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పులికొండ గుత్తి టర్నింగ్‌లో టీవీ షాపును పెట్టుకుని మెకానిక్ పని చేస్తూ జీవిస్తున్నాడు. పట్టణానికి చెందిన వంశీ అనే యువకుడికి, పులికొండకు కొన్నేళ్లుగా వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. రాత్రి 7 గంటల సమయంలో పులికొండపై వంశీ రాడ్‌తో తలపైన కొట్టి గాయపరిచాడు. దీంతో పులికొండ తీవ్రంగా గాయపడి పడిపోయాడు. స్థానికులు ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పత్తికొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

గోస్పాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసురపాడు గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలయ్యాయి. అక్షయ్ కుమార్ అనే విద్యార్థి పసురపాడు ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు రోడ్డువెంట వెళుతుండగా వేగంగా వచ్చిన మోటార్ సైకిల్ విద్యార్థిని బలంగా ఢీకొట్టింది. గాయపడిన విద్యార్థి అక్షయ్‌కుమార్‌ను నంద్యాలలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. విద్యార్థికి కాలు ఫ్రాక్చర్ అయినట్లు డాక్టర్లు చెప్పారని ఎంఈవో అబ్దుల్ కరీం తెలిపారు. గోస్పాడు పోలీసుల దృష్టికి తీసికెళ్లినట్లు తెలిపారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎంఈవో అబ్దుల్‌కరీం

బనగానపల్లెలో చోరీ



పరిశీలిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది

బనగానపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో సోమవారం చోరీ జరిగినట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎన్‌జీవో కాలనీలో నివసిస్తున్న దూదేకుల నాగరాజు యాగంటిపల్లెలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన విధులకు వెళ్లాక, భార్య హుసేనమ్మ ఇంటికి తాళం వేసి యాగంటి క్షేత్రానికి బయలుదేరారు. ఇంటికి వచ్చాక.. తాళం పగులగొట్టి బీరువా లోని 15 తులాల బంగారును, రూ.20వేల నగదును దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్‌సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. టీచర్ నాగరాజు ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీసీఐ కేంద్రాన్ని పరిశీలించిన జేడీ

ఎమ్మిగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మంత్రాలయం రోడ్డులో ఉన్న శివ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ పరిశీలించారు. సోమవారం ఆయన స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో అధికారులతో మాట్లాడారు. అనంతరం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పత్తి కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇల కైలాసం.. శ్రీశైలం

- పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం
- ఆది దంపతులకు ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు
- శ్రీశైలానికి కార్తీక శోభ



పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం



శ్రీశైలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూలోక కైలాసంగా శ్రీశైలం బాసిల్లుతోంది. కార్తీక రెండో సోమవారం శాస్త్రోక్త పూజలను నిర్వహించారు. సాయంకాలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్సవంగా పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పుషాలతో అలంకరించిన వేదికపై ఆసీనుల చేసి పూజా క్రతువులు జరిపించారు. పుష్కరిణికి దశవిధ హారతులను ఇచ్చారు. పుష్కరిణి నాలుగువైపులా లక్షదీపోత్సవాన్ని నిర్వహించి శివ సేవకులు భక్తులు దీపాలు వెలిగించుకోవటానికి అవకాశం కల్పించారు. కార్తీక మాసంలో దశవిధ హారతులను దర్శించడంతో సకల సౌభాగ్యాలు కలుగుతాయని నమ్మకం. లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతిని దర్శించుకోడానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నారని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. కోవూరు నియోజవకర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు దేవకి వేంకటేశ్వర్లు, ఎడిటర్ అనిల్‌కుమార్, ఈఈ నర్సింహరెడ్డి, డీఈ శాస్త్రి, ఏఈవోలు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



హారతి ఇస్తున్న అర్చకుడు



గ్రామోత్సవం

మహానందికి పోటెత్తిన భక్తులు

- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు



మహానందిలో దర్శనంకోసం క్యూలో నిల్చొన్న భక్తులు

మహానంది, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక రెండో సోమవారం కావడంతో మహానంది క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో వేకువజామున స్వామి అమ్మవార్లకు నిర్వహించే మహామంగళ హారతులతో పాటు ప్రత్యేక పూజలు అర్చకులు చేశారు. ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులకు దర్శనం ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు కార్తీక పుణ్య స్నానాలను కుటుంబ సమేతంగా ఆచరించారు. మహిళలు నాగులకట్టతో పాటు మహా ముఖద్వారం ముందు కార్తీక దీపాలను వెలిగించారు. అభిషేక ప్రియుడైన మహానందీశ్వరునికి 54 సామూహిక అభిషేకాలు, పదుల సంఖ్యలో కేదారేశ్వర నోములను నోచుకున్నారు. రాత్రి 7గంటల నుంచి రెండో ప్రాకారంలోని కోనేరుకు ఆలయ అర్చకులు జలహారతిని ఇచ్చారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, పసుపుల సుబ్బారెడ్డితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాల్వబుగ్గలో పూజలు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు తరలిచ్చారు. కోనేటిలో స్నానం అనంతరం శివలింగానికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె లక్ష్మీనరసింహ శర్మ పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, హుశేనాపురం సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ ఆధ్వర్యంలో పుష్పాలంకరణ చేశారు. ఆలయ ఈవో మద్దిలేటి, ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర ఆధ్వర్యంలో కమిటీ సహకారంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించారు

ఎయిడ్స్ రహిత జిల్లా సాధనకు కృషి చేద్దాం

- నూతన మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాను ఎయిడ్స్ రహితంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డా.సిరి సూచించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా కర్నూలుకు చేరుకున్న నూతన మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని హై రిస్క్ ప్రాంతాలక వెళ్లి పరీక్షలు చేసేలా ప్రనాళిక రూపొందించాలని డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్‌ను ఆదేశించారు. ప్రతి ఒక్కరు హెచ్ఐవీ పరీక్ష చేయించకుని వారి స్థితిని తెలుసుకోవాలన్నారు. సమస్య ఉన్న వారు జీవితకాలం మందులు వాడాలని సూచించారు. డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ మాట్లాడుతూ మొబైల్ వాహనం ద్వారా జిల్లాలో హెచ్ఐవీ, సుఖ వ్యాదులపై అవగాహన, కౌన్సెలింగ్, పరీక్షలు చేస్తామన్నారు. ఽ డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీసీహెచ్ఎస్ డా.ఎస్.జఫరుల్లా, డీఎంవో ఏ.నూకరాజు, ఏపీ సాక్స్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలిహైదర్, ఎస్‌వో దేవీశంకర్‌గౌడ్, క్లస్టర్ పీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీ జోక్యంతో సమస్య పరిష్కారం

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంపీ బస్తిపాటి నాగరాజు జోక్యంతో పత్తి రైతుల సమస్య పరిష్కరమైంది. సోమవారం పెంచికలపాడు సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోల్లు ఆగిపోవడంతో రైతులు రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రాప్‌లో నమోదు చేసుకుని, కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోగా మెసేజ్ రావడంతో రైతులు సోమవారం సీసీఐ కేంద్రానికి పత్తి లోడ్‌ను తీసుకొచ్చారు. తీరా ఇక్కడకు రాగా, తమకు వివరాలు రాలేదంటూ సీసీఐ కేంద్రం అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహించి రోడ్డుపై బైఠాయిం చారు దీంతో వాహనాలు నిలిచిపోయాయి. అటుగా వెళ్తున్న ఎంపీ ఆగి, సమస్యను తెలుసుకుని, సీసీఐ కేంద్రానికి వెళ్ళి అధికారులతో మాట్లాడారు. ఢిల్లీలోని సీసీఐ అధికారులతో మాట్లాడి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. సరిచేయడంతో పత్తికొనుగోళ్లు ప్రారంభించారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

షటిల్ బ్యాడ్మింటన్, చెస్‌లో విజేతలుగా నిలవాలి

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్



షటిల్ బాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఫిరోజ్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు, చిత్తూరు జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆకాంక్షించారు. సోమవారం బొమ్మల సత్రంలోని నంది బ్యాడ్మింటన్ అకాడమీలో ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్, చెస్ జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో ప్రతిభచూపి నంద్యాలకు పేరు తేవాలన్నారు. క్రీడలకు ఎప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని, నంద్యాల కీర్తి పతాకాన్ని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎగురవేయాలన్నారు. స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శులు బి.విశ్వనాథ్, ఆశాజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈపోటీల్లో జిల్లావ్యాప్తంగా 350మంది పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు. నందిగ్రూప్ చైర్మన్ సుజల క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. డీఈవో జనార్దన్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభా కాంక్షలు తెలిపారు. ఏపీ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవ చైర్మన్ నిమ్మకాయల సుధాకర్, వ్యవస్థాపక అధ్యక్షుడు ఏపీరెడ్డి, ఉర్దూ అకాడమిక్ డైరెక్టర్ అస్మద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దండెనాగరాజు, సురేష్‌నాయుడు, బుచ్చిబాబు, మౌలాలి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదంపై సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆరా



ప్రమాదం స్థలంలో పరిశీలిస్తున్న ప్రతినిధులు

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనపై సేవ్ లైఫ్ ఫౌండేషన్ బృందం ఆరా తీసింది. ప్రతినిధి మల్లికార్జున పాటిల్‌తో పాటు మరో ముగ్గురు సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ బృందం వెంట పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, తాలుకా సీఐ తేజామూర్తి, ఎస్ఐ ధనుంజయలు ఉన్నారు.

జాతీయ రహదారుల అధికారి పరిశీలన

బస్సు ప్రమాద ఘటన స్థలాన్ని జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ వరుణ్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. జాతీయ రహదారిలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని పరిశీలించారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంవీఐ నాగరాజు నాయక్ ఉన్నారు.

దేశానికే ఆదర్శం కండి

- బ్యాంకులో వాటాదారులుగా చేరండి
- నెలకు రూ.5వేలు చెల్లించండి..
- పొదుపు మహిళలతో ఓర్వకల్లు మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి



సమావేశంలో మాట్లాడుతున్న విజయభారతి

ఓర్వకల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పొదుపు మహిళలు మహిళా బ్యాంకులో వాటాదారులుగా చేరి దేశానికే ఆదర్శంగా నిలవాలని పొదుపులక్ష్మి మండల సమాఖ్య గౌరవ సలహాదారాలు విజయభారతి సూచించారు. సోమవారం ఓర్వకల్లులోని మండల సమాఖ్య శిక్షణా భవనంలో మండల మహిళా సమాఖ్య మహిళా బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విజయభారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని విజయభారతి ప్రారంభించారు. ప్రతి సంఘం మహిళా బ్యాంకులో వాటాదారులుగా చేరి నెలకు రూ.5వేలు చెల్లించినట్లయితే.. మహిళలు బ్యాంకు హక్కుదారులుగా మారి రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికి 475 సంఘాలు వాటాదారులుగా నమోదు చేసుకున్నాయన్నారు. లీడర్లు, మహిళా బ్యాంకు బోర్డు డైరెక్టర్లు, ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

జోగి రమేష్ అరెస్టు సక్రమమే

● కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో వైసీపీ నాయకుడు జోగి రమేష్ అరెస్టు సక్రమమేనని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్‌రెడ్డి విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలు చేసి, నేడు టీడీపీ పాలన చూసి జీర్ణించుకోలేక పోతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను సీఎం చంద్రబాబు సరి చేస్తున్నారని జీర్ణించుకోలేని జగన్ విష ప్రచారం చేయడం సరికాదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చేందుకు జగన్ మోసపూరిత హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను ముప్పు తిప్పలు పెట్టాడన్నారు. జె.బ్రాండ్ మద్యంతో అనారోగ్యం పాలు చేశారని, కిడ్నీ, లివర్, నరాల సమస్యలతో వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. గత నెల 10వ తేదీన దూపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమ్మితం ఆసుపత్రికి తరలించగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఆచూకి తెలిసిన వారు 9121101069నెంబరుకు ఫోన్ చేయాలని ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ డాక్టర్ సిరి పిలుపునిచ్చారు. సోమవారం సునయన ఆడిటోరియంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులక అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. పెరిగిన జనాబాకు అనుగుణంగా కార్మికులను నియమించి, పనిభారం తగ్గించాలన్నారు. రెండేళ్లుగా పెండింగ్ ఉన్న కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు ఏపీజీఎల్ఐసీ బాండ్లు ఇవ్వాలన్నారు. పి.మద్దిలేటి, జి.చంద్రశేఖర్, రామాంజనేయులు, నాయకులు బాబులాల్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కలెక్టర్ సిరి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టచ్‌ఫోన్, వీల్ చైర్లు, ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు.

అనుచిత వాఖ్యలపై కేసు నమోదు

కోడుమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చికెన్ దుకాణాకి చెందిన వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాల మేరకు.. హిందూ దేవుళ్లపై అనుచిత వాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో పట్టణంలోని హిందువులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఐ స్వామి తప్పకుండా చర్యలు తీసుకొంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఉరుకుంద యాదవ్, గోపాల్‌నాయుడు, మహేష్ నాయుడు, నాగేశ్వరరావు, తాయప్ప పాల్గొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైపాస్‌కు నిధులు ఇవ్వండి

● ఆర్‌అండ్‌బీ ఛీఫ్ ఇంజనీర్‌ను కోరిన ఎమ్మెల్యే గౌరు చరిత



ఆర్‌అండ్‌బీ ఛీఫ్ ఇంజనీరుకు లేఖ ఇస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గంలోని నన్నూరు-చిన్నటేకూరు-గూడురు-ఎమ్మిగనూరు బైపాస్ నిర్మిణానికి నిధులు మంజూరు చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. సోమవారం కర్నూలుకు వచ్చిన ఆయనను ఎమెలేఏ్య కలిశారు. నన్నూరు నుంచి బస్తిపాడుకు సుమారు 15 కి.మీ.ల రహదారి విస్తరణతో పాటు క్రాస్ డ్రైనేజీ పని చేస్తున్నారన్నారు. పాణ్యం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారులకు కూడా నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. కర్నూలు జిల్లా అనుగొండ-లక్ష్మీపురం రహదారి మరమ్మతులకు-రూ.15 లక్షలు, మిద్దూరు-ఓర్వకల్లు సీసీ రహదారికి రూ.50 లక్షలు, నంద్యాల-నందికొట్కూరు రహదారి పనులకు రూ.20 లక్షలు, గోనవరం-బలపనూరు రహదారికి రూ.27 లక్షలు మొత్తం రూ.1.12కోట్ల అంచనా వ్యయంతో పనులకు పరిపాలనా అమోదం మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఛీఫ్ ఇంజనీరుకు లేఖ అందించారు.

నకిలీ నియామకాన్ని రద్దు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గణేష్‌నగర్‌కు చెందిన వ్యక్తి నకిలీ ధృవపత్రాలతో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందారని దాన్ని రద్దుచేయాలని జాతీయ లంబాడి సంఘం నాయకుడు యోగేష్ నాయక్ కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బుడగ జంగాల కులానికి చెందిన జమ్మక్క కుమారుడైన మద్దిలేటి నకిలీ ఎస్టీ సర్టిఫికేట్‌తో ఉద్యోగం పొందాడని ఆరోపించారు. ఆయన బతికుండగానే మద్దిలేటి కుమారుడు నారాయణ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో స్వీపర్‌గా పని చేసిన నాయనమ్మ జమ్మక్క కుమారుడుగా నకిలీ ధృవపత్రాలు సృష్టించి కారుణ్య నియామకం పొందారన్నారు.

7న టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 7వ తేదీన అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్ తెలిపారు 11, 13, 15, 17, 19 ఏళ్లలోపు బాలబాలికలు సీనియర్ పురుషులు, మహిళలకు ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయుస్సు ధృవీకరణ పత్రంతో పాటు మూడు ఫోటోలతో హాజరు కావాలన్నారు.

'కర్ణుడు అసమాన పరాక్రమవంతుడు'



దామగట్ల సరోజను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో కర్ణుడు అసమాన పరాక్రమవంతుడని, అయితే దుష్టుల సహచర్యంతో విషాదాంత నాయకుడిగా మిగిలిపోయాడని ప్రముఖ వక్త, ధార్మిక ప్రవచన కర్త దామగట్ల సరోజ అన్నారు. ఆదివారం నగరంలోని మద్దూరునగర్ పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, సాహితీ సదస్సు సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య స్మారక ఉపన్యాసం సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య వక్తగా విచ్చేసిన సరోజ మాట్లాడుతూ మహాభారత కథ కర్ణుడి ప్రవేశం వరకు ఒకలా, తరువాత మరోలా ఉంటుందని అన్నారు. సభాధ్యక్షతన వహించిన కేసీ కల్కూర మాట్లాడుతూ కన్నడ భాషలో పంప మహాకవి రాసిన మహా భారతంలోని పద్యాలు వినిపించారు. సాహితీవేత్తలు జేఎస్ఆర్‌కే శర్మ, డాక్టర్ వి. పోతన తదితరులు ప్రసంగించారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ ఆదేశించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదిక నిర్వహించగా, 28 అర్జీలు వచ్చాయి. అర్జీలను చట్టపరిధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జగన్నాథగట్టు వద్ద ఎన్టీఆర్ కాలనీ టిడ్కో గృహాలకు సంబంధించి 365 చదరపు అడుగుల గృహానికి రూ.25 వేలు, 430 చదరపు అడుగుల గృహానికి రూ.50వేలు చెల్లించాలన్నారు. లబ్ధిదారులు పూర్తి నగదు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రుణం పొందిన లబ్దిదారులు నగర పాలక కార్యాలయంలో ఫోటో, ఆధార్ కార్డు ఇవ్వాలని, త్వరలో గృహాలను కేటాయిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.వై.నాగప్రసాద్‌బాబు, ఆర్ఓ స్వర్ణలత, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు కాలనీలపై వివక్ష చూపుతున్నారని శివారు కాలనీ వాసులు సి.మల్లికార్జున, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి ఆరోపించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేది కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. శివారు కాలనీలలో రోడ్లు, కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండి.యూనుస్, ఆర్.ఆనంద్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య విధానమే వన్ హెల్త్ అప్రోజ్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం పశువైద్యం, పర్యావరణాన్ని అనుసంధానించేదుకే వన్ హెల్త్ అప్రోచ్ అని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు అన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్, ఐసీఎంఆర్ ఆదేశాల మేరకు సోమవారం సర్వజన వైద్యశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జునోటిక్ వ్యాధులు, యాంటీ మైక్రోబయాల్ ముప్పును నివారించడానికి ఇది ఉపయోగపడుతుం దన్నారు. యాంటిబయాటిక్స్ తగ్గించాలని, జంతువుల కాటుకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.సుధా కుమారి, వైస్ ప్రిన్సిపాల్ డా.సింధియా శుభప్రద, సీఎస్ఆర్ఎంవో డా.పి.పద్మజ, డా.టీసీహెచ్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ, వన్‌హెల్త్ అవేర్నెస్ నోడల్ ఆఫీసర్ డా.వైష్ణవి పాల్గొన్నారు.

రూ.20 వేల కోట్లు కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20వేల కోట్లు నిధులు కేటాయించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పెండింగ్ ఉన్న వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడికాలువ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసిన యువతకు ఉపాధి చూపాలని, ఒకప్పటి రాష్ట్ర రాజధాని ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం వల్ల దేశంలోనే వెనుకబడిన జిల్లాగా ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు. శ్రీరాములు, శ్రీకాంత్, చంటి, అఖిల్, కృష్ణ ఉన్నారు.

పొలం గట్ల విషయంలో ఘర్షణ

సి.బెళగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామంలో రైతులు ఘర్షణ పడ్డారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అజయ్‌కు, అదే గామానికి చెందిన మల్లేష్, ఈరన్న పొలం గెట్ల విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఇంతలోనే అజయ్‌పై చెలుకపార, రాళ్ళతో దాడి చేయడంతో అజయ్‌కు తలకు గాయాలయ్యాయి. ఫిర్యాదు మేరకు మల్లేష్, ఈరన్నపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు.

దివ్యాగులకు ర్యాంప్ ఏర్పాటు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ నూరుల్ కమర్‌తో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీ వచ్చిన వెంటనే పరిష్కరించాలని, గడువు దాటే వరకు పరిష్కరించకుండా ఉండకూడదన్నారు. ఆడిట్ వంద శాతం పూర్తిచేయాలని, సీఎంవో నుంచి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం



ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యూ గ్రేటర్ కర్నూలు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయంలో అధ్యక్షుడిగా కె.రంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ముక్తార్ బాషా, ప్రధాన కార్యదర్శిగా జె.మురళీమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బి.మహబూబ్ బాషా, ఎస్‌పి.ముస్తాక్ అహ్మద్, కార్యదర్శులు ఎస్ఎండి.ఇలియాస్, ఎస్.ఖాజాహూస్సేన్, సంయుక్త కార్యదర్శులుగా సతీష్‌కుమార్, శివరాంప్రసాద్, కోశాధికారిగా కే.రంగన్న, ఇతరులను ఎన్నుకున్నారు.



పశుగ్రాసం సాగు చేయాలి

సి.బెళగల్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): పాడి పశువుల కోసం రైతులు పశుగ్రాసాన్ని సాగుచేయాలని పశువైద్యా ధికారి రోనాల్డ్ సూచించారు. సోమవారం పోలకల్లు పశువైద్యశాలలో పాడి రైతులకు మొక్కజొన్న, జొన్న మినీ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇస్తోందని సద్విని యోగం చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ శృతి, గంపరాజు వెంకటేశ్వర్లు, రవి ఉన్నారు.

ప్రపంచ కప్ విజయంపై ర్యాలీ



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆదివారం జరిగిన ప్రపంచ కప్ మహిళా క్రికెట్ పోటీలో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించిన మహిళా క్రికెట్ జట్టును విద్యార్థులు అభినందించారు. వారికి మద్దతుగా సోమవారం స్థానిక ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ఆనందాన్ని పంచుకున్నారు.

● స్థానిక అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో భారత మహిళా వరల్డ్ కప్ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు

ఉచిత ఐఐటీ-నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదివిన విద్యార్థులకు హాస్టల్ వసతితో ఉచిత ఐఐటీ-నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు అనంతపురం, ఉమ్మడి కర్నూలు జిల్లాల డీసీవో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందని విద్యార్థులు జిల్లా కో ఆర్డినేటర్‌ను 9949354106 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కోడుమూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కేపీఎస్ఆర్ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అల్తాఫ్, మహేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలను స్తంభింపజేస్తాం

కర్నూలు రూరల్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు ఇంటర్ సిటీ రైలును నడపాలని ధర్నా చేస్తున్నా స్పందించడం లేదని, ఇలాగే వ్యవహరిస్తే రైళ్ల రాకపోకలను స్తంభింప చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మలమ్మ హెచ్చరించారు. కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ వద్ద చేస్తున్న 48గంటల దీక్షల అనంతరం సోమవారం మహాధర్నా నిర్వహించారు. పంచలింగాల వద్ద రైల్వే వర్క్‌షాప్ పనులను త్వరాగా పూర్తిచేయాలని, కొత్తరైల్వేలైన్ నిర్మించాలన్నారు. నగరానికి రైల్వే సౌకర్యాలు కల్పించాలని 2015 నుంచి కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే అధికారులకు పలుమార్లు వినతపత్రాలు ఇచ్చినా వారిలో కదలిక లేకపోవడం దుర్మార్గమన్నారు. ఇటీవలే వచ్చిన ప్రధాని మోదీకి ఎంపీ బస్తిపాటి నాగరాజు, మంత్రి టీజీ భరత్ ఎందుకు వివరించలేదని ప్రశ్నించారు. నంతరం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు రాముడు, రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, అంజిబాబు, అలివేలు,నగేష్‌సాయిబాబా, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన అధ్యాపకులు

అమర్థ్యసేన్ జయంతి

కర్నూలు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్థిక శాస్త్రానికి మానవీయ కోణాన్ని జత చేసిన మహనీయుడు అమర్థ్యసేన్ అని ఆర్‌యూ రెక్టార్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. సోమవారం యూనివర్సిటీలో అమర్థసేన్ 92వ జయంతి నిర్వహించారు. భారతరత్నతో పాటు నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయ శాస్త్రవేత్తగా నిలిచారన్నారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, ఆర్థిక వేదిక వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ మన్సూర్ రహమాన్, ఎకనామిక్స్ విభాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ శ్రీధర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



టీకాలతో పశువుల్లో రోగాలు దూరం

కల్లూరు, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): పశువులకు సకాలంలో వ్యాధి నిరోదక టీకాలు వేయిస్తే రోగాలు దూరమవుతాయని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్.దీప్తి అన్నారు. సోమవారం నాయకల్లు గ్రామంలో ఆపార్డ్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ నాయకుడు మాదేష్ సిబ్బంది, రంగస్వామి పాల్గొన్నారు.

ఉపాధి కల్పిస్తాం.. వలస వెళ్లొద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సి. బెళగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూలీలు వలస వెళ్లవద్దని, అందరికీ ఉపాధి కల్పిస్తామని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. సోమవారం అంధ్రజ్యోతి దినపత్రికలో 'వలసబండి' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. ఈ మేరకు మండలంలోని శింగవరం, ముడుమాల, ఇనగండ్ల, గ్రామాలలో పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉన్నారు.

పంటకోత ప్రయోగం

కోడుమూరు రూరల్, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): గోరంట్ల గ్రామంలోని ఉమాదేవి అనే మహిళారైతు పొలంలో వేరుశనగ పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు ఏవో రవిప్రకాష్ తెలిపారు. నిర్ణీత విస్తీర్ణంలో 2.1 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఏఈవో బాలకృష్ణ, సిబ్బంది హరిప్రసాద్, సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించండి

ఓర్వకల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. సోమవారం కార్యాలయంలో గ్రామాల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. స అధికారులు పరిశీలించి, పరిష్కరించి, ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థినులకు తిరిగి చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం మాచాని సోమప్ప జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల నుంచి అక్రమంగా రుసుమును తిరిగి చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో 3,600 మంది విద్యార్థినులు చదువుతున్నారన్నారు. కొత్తగా చేరిన 850 మంది నుంచి రూ.150ల చొప్పున అక్రమంగా వసూలు చేశారని, పదో తరగతి పూర్తిచేసిన వారి నుంచి టీసీ పేరుతో కూడా వసులు చేశారన్నారు. హెచ్‌ఎంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసులు, అమర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

● ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు మాలతి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మాలతి

పత్తికొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు మాలతి సూచించారు. సోమవారం పత్తికొండకు వచ్చిన ఆమె స్థానిక కస్తూర్బా, బాలికల గురుకుల పాఠశాలలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వసతి సదుపాయాలు, పాఠ్య పుస్తకాలు తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పిల్లలకు మంచి ఆహారాన్ని అందించాలన్నారు.

అధికారులతో భేటీ

స్థానిక ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ ఉసేన్‌సాహెబ్, ఎంపీడీవో కవితలతో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు మాలతి వేర్వేరుగా సమీక్ష సమావేశాలు జరిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచేవిధంగా కృషి చేయాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పత్తికొండ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మాలతి పార్టీ శ్రేణులను కోరారు. స్థానిక కార్యాలయంలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవర్ధన్‌నాయుడు, నరేష్, బ్రహ్మయ్య, రామాంజనేయులు సీసీ రంగన్న, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



కటారుకొండలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

క్రిష్ణగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని పెదొడ్డి, ఆలంకొండ గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే బోయ బొంతిరాళ్లలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, కటారుకొండ గ్రామంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మర్రి మోహన్ రెడ్డి, పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ అలంకొండ నబి సాహెబ్, టీడీపీ కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ లీగల్ సెల్ ప్రధానకార్యదర్శి మాదాపురం ఎల్వీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణాపురం దామోదర్ నాయుడు, సర్పంచులు షేక్ షహన, లెనిన్ బాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడాలి

దేవనకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతలు కాపాడాలని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు కోరారు. సోమవారం కర్నూలులో డీఐజీ కార్యాలయంలో కోయ ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

దేవనకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. సోమవారం దేవనకొండలో ఎంపీడీవో జ్యోతికి వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని గ్రామాలలో సీసీరోడ్లు లేకపోవడంతో మురుగునిల్వలతో దుర్గంధం వెదజల్లుతోందని రామాంజినేయులు, భాస్కర్ అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో గోపాల్ ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దేవనకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. మండలంలోని సమస్యలపై ఎం పీటీసీ సభ్యులు, సర్పంచులు సభలో ప్రస్తావించాలని సూచించారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

మద్దికెర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. సోమవారం ఓ భక్తుడి స్వగృహంలో అయ్యప్ప స్వామి మండపాన్ని అందంగా పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. స్వాములు అయ్యప్ప కీర్తనలు ఆలపించి స్వామివారికి 18మెట్ల ప్రత్యేకపూజలు చేశారు. ఒక్కొక్క మెట్టుకు ఒక్కో దీపాన్ని వెలిగించారు. అనంతరం స్వాములు భిక్ష స్వీకరించారు. అయ్యప్ప భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, జనసేన ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. ఆలూరులో సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజాదరణ పొందుతున్నారన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తూ ఆదుకుంటున్నారన్నారు. ప్రజలపై భారం తగ్గించేందుకు జీఎస్టీని తగ్గించారన్నారు. ఆలూరు నియోజకవర్గంలో అభివృద్ధికి కలిసికట్టుగా పని చేస్తామన్నారు. జనసేన పార్టీ ఐటీ కో ఆర్డినేటర్ రంజిత్, నాయకులు అరవింద్, అశోక్, జగదీశ్, ఛత్రపతి, మున్నా పాల్గొన్నారు.

టీడీపీ ఇన్‌చార్జిని కలిసిన ఎస్ఐ

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆలూరు ఎస్ఐ మన్మథ విజయ్ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ నాయకులు కోరారు.



మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

ఆటో దగ్ధం

దేవనకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తితీసే కూలీలను తీసుకొచ్చిన ఆటో దగ్ధమైంది. తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన నేట్టికల్ ఆటోలో కూలీలు మండలంలోని కుంకనూరుకి వచ్చారు. గ్రామ సమీపంలో ఆటోను నిలిపి సమీప పొలాల్లో పత్తితీసే పనిలో కూలీలు నిమగ్నమయ్యారు. ప్రమాదవశాత్తు ఆటో దగ్ధమైంది. పొలం నుంచి వచ్చేసరికి ఆటో పూర్తిగా మంటలో కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులా పనా లేక షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా తెలియాల్సి ఉంది. ఘటనపై బాధితుడు నేట్టికల్ దేవనకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా కార్తీక పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మద్దికెర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర సమీపంలోని బుగ్గ సంగమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

శ్మశాన స్థలాన్ని అన్యాక్రాంతం చేయొద్దు

మద్దికెర, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దమ్మ కుంట సమీపాన వద్ద ముస్లింల శ్మశాన వాటిక స్థలాన్ని అన్యాక్రాంతం చేయొద్దని ముస్లింలు కోరారు. సోమవారం జామియా మసీదు నుంచి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముం దు ధర్నా చేపట్టారు. నాయకులు ఆకుల ఖాజావలి, సత్తార్, సలాం, ఖలీల్ మాట్లాడుతూ సర్వే.నెంబర్ 185/3బి, 186లో నాలుగెకరాల పదిసెంట్లు శ్మశాన వాటిక ఉందన్నారు. శ్మశాన వాటిక ముందు భాగంలో కొంతమంది పంచాయతీ అనుమతులతో నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇలా చేయడం వల్ల శ్మశానంలోకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోపై ఫిర్యాదు

ఆదోని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలనాధికారి వసుంధర విధులకు సరిగా హాజరుకావడం లేదని, నెలలో కేవలం ఒకటి, రెండు రోజులు మాత్రమే వస్తున్నారని ఆరోపిస్తూ ముందడుగు సంస్థ జిల్లా అధ్యక్షుడు దేశాయ్ చంద్రన్న సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

ఆదోని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు మృతి చెందిన ఘటనపై వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బోయ తిమ్మప్ప, ఎల్ఎల్‌సీ చైర్మన్ బసాపురం రామస్వామి, ఏపీ బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెస్త రామాంజనేయులు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూవేంకటేశ్వరస్వామి ఆలయం ఎండోమెంట్ పరిధిలో లేదని గుర్తుచేశారు. అర్చకులు అనుమతులు లేకుండా కార్యక్రమం నిర్వహించడం వల్లే ఈదుర్ఘటన చోటు చేసుకుందన్నారు.

రబీకి తుంగభద్ర నీరు

● మార్చి మొదటి వారం వరకు సరఫరాకు ప్రాజెక్టు కమిటీ తీర్మానం



సమావేశంలో పాల్గొన్న కమిటీ వైస్ చైర్మన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు

ఆదోని, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ కింద రబీ సీజన్‌కు మార్చి మొదటి వారం వరకు నీటిని సరఫరా చేయాలని తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ తీర్మానించింది. సోమవారం ఆదోనిలోని టీబీపీ ఎల్ఎల్‌సీ కార్యాలయంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. కమిటీ వైస్ చైర్మన్ హుసేన్‌సాబ్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఖరీఫ్-2025 కొనసాగింపుగా, రబీ సీజన్ 2025-26 పంటల కోసం తుంగభద్ర డ్యాం నుంచి 10.04 టీఎంసీల ఎల్ఎల్‌సీ వాటా నీటిని మార్చి మొదటి వారం వరకు అందించాలని తీర్మానించారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి రబీకి సాగునీరు తప్పనిసరని కమిటీ పేర్కొంది. నీటి విడుదలకు ప్రత్యేక తీర్మానం కోసం మంగళవారం కలెక్టర్‌ను కలవాలని, అలాగే సాగునీటి విడుదలపై తక్షణమే సమావేశం నిర్వహించాలని కోరుతూ తుంగభద్ర డ్యాం అధికారులకు లేఖ రాయాలని చైర్మన్ టిప్పు సుల్తాన్ స్పష్టం చేశారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో డ్యాం గేట్ల మరమ్మతులకు ఒకనెల పొడిగింపు ఇవ్వాలని, హంద్రీనీవా కాలువ నుంచి తుంగభద్ర దిగువ కాలువకు నీటి సరఫరా ప్రతిపాదనను సిద్ధం చేయాలని కూడా కమిటీ తీర్మానించింది. సమావేశంలో ఎల్ఎల్‌సీ ఈఈ పాండురంగయ్య, ఇతర డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వైభవంగా కలశ స్థాపన

● హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఆలూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో వెలిసిన హుచ్చీరప్పతాత దేవాలయ గోపురం ప్రారంభం, కలశ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవాలయంలో వేదపండితులు బెల్డోణ రామనాథ్‌స్వామి ఆధ్వర్యంలో గణపతిపూజ, హోమం, పుష్పాలంకరణ, పల్లకీ మహోత్సవం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గోపురం ప్రారంభోత్సవం, కలశ ప్రతిష్ఠాపన మహోత్సవం కార్యక్రమంలో ఎంపీ నాగరాజు, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి వేర్వేరు సమయాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఠాధిపతి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే చర్యలు : సీఐ



డంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆస్పరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని సీఐ ఎ.గంగాధర్ హెచ్చరించారు. ఆస్పరిలోని అంబేడ్కర్ కూడలిలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. బ్రీతింగ్ ఎనలైజర్ ద్వారా వాహనదారులు, డ్రైవర్లను పరీక్షించారు. సీఐ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రాణం కన్నా ఏదీ ముఖ్యం కాదని, కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని సురక్షిత ప్రయాణాలు కొనసాగించాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, నిదానంగా వెళ్లాలని సూచించారు. లైసెన్స్ దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

వృత్తి విద్యపై అవగాహన అవసరం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్ఎం రవి అన్నారు. సోమవారం సమగ్ర శిక్ష ఆదేశాలతో పాఠశాల ఒకేషనల్ విద్య ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్, ఆపెరల్ ఆటోమేటిక్ కోర్సులో విద్యార్థులకు నైపుణ్యాలను ప్రదర్శించి వారి ప్రతిభను చాటుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థి దశ నుంచే వారికి వృత్తి నిచ్చే ఉపాధి కోర్సులు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. హర్షద్ ప్రదర్శించిన సెక్యూరిటీ అలారం సిస్టం ఎలక్ట్రానిక్స్ ఉత్తమ ప్రాజెక్టు, రాఘవ ప్రదర్శించిన బాబిన్ వైండర్ ఆపేరియల్ ఉత్తమ ప్రాజెక్టు, జ్యోత్స్నశ్రీ ప్రదర్శించిన ఆటోమేటిక్‌లో ఉత్తమ ప్రాజెక్టు వాటర్ ట్యాంక్ ఫిల్లింగ్ అలారం ప్రాజెక్టును ఈనెల 7న జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. న్యాయ నిర్ణేతగా ఉపాధ్యాయుల గిడ్డారెడ్డి, శ్రీరాములు ఉపాధ్యాయుల శివకుమార్ భార్గవి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర కమిటీ ఎన్నిక

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నగర్ కమిటీని సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. విభాగ్‌కన్వీనర్ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో నగరకార్యదర్శిగా శివచరణ్ సహాయకార్యదర్శిగా సాయికుమార్ జనార్ధన్ వినయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, కన్వీనర్ వీరేష్ పాల్గొన్నారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించాలి

ఆదోని టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాన్ లేఅవుట్‌లోని ప్లాట్లను ఎల్ఆర్ఎస్ స్కీం కింద క్రమబద్ధీకరణ చేయించుకోవాలని మున్సిపల్ టీపీవో బాల ముద్దయ్య సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ గడువు ముగియడంతో ప్రభుత్వం మరో మూడు నెలలు గడువు ముగియడంతో ప్రభుత్వం మరో మూడు నెలలు గడువును పెంచుతూ అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వం మరోసారి గడువు పెంచే అవకాశం ఉండదని చెప్పారు.

6న నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

పత్తికొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో ఈనెల 6న ఎమ్మెల్యే శ్యాంబాబు సమీక్ష నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకుడు నరసింహ చౌదరి తెలిపారు. నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి, పలు అంశాలపై ఎమ్మెల్యే సమీక్షించనున్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న పోలీసులు

ఆదోని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డీఎస్పీ శ్రీనివాస ఆచారి సోమవారం ఉదయం ఆదోని రైల్వే పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు చోరీకి గురైన 17 సెల్‌ఫోన్‌లను రికవరీ చేయించి వాటిని బాధితులకు అందజేశారు. ఆదోని ఆర్‌పీఎస్‌కు చేరుకున్న డీఎస్పీ శ్రీనివాస ఆచారి ముందుగా సిబ్బందితో డ్రిల్ చేయించారు. అనంతరం ఆర్‌పీఎఫ్ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించి రైల్వే భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంపై చర్చించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ముఖ్యంగా ఓల్డ్ బ్రిడ్జ్ వద్ద పరిశీలించి వాటి పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆదోని రైల్వేస్టేషన్ మేనేజర్ ఎస్ఎంఆర్‌తో మాట్లాడి ప్రయాణికులకు మెరుగైన భద్రత కల్పించే అంశాలపై సూచనలు ఇచ్చారు. ఆర్‌పీఎస్ రికార్డులను, స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు.

ఆయుర్వేదంతోనే దీర్ఘకాలిక వ్యాధులు నయం

తుగ్గలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదంతోనే దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని వైద్యుడు అమర్నాథ్ యాదవ్ అన్నారు. సోమవారం తుగ్గలి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ఆయుర్వేదిక్ చికిత్సలు చేశారు. వైద్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయుర్వేద మందులను క్రమ తప్పకుండా వాడితే దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకోవచ్చన్నారు. ఆహార నియమాలు కూడా పాటించాలన్నారు.

రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



విద్యార్థి కరుణ్‌షాతో హెచ్ఎం

దేవనకొండ, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు గుండ్లకొండ జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కరుణ్ షా ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం హృదయరాజు తెలిపారు. నంద్యాలలో ఉమ్మడి జిల్లాస్థాయి షటిల్ బాట్మంటన్ పోటీలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కరుణ్‌షా ఎంపిక పట్ల పాఠశాల పీడీ మద్దిలేటి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు రంగనాథ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

మద్దికెర, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ పారా రవికుమార్, ఈవో ఈరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో హుండీ లెక్కింపులో పాల్గొనాలని పేర్కొన్నారు.

నిబంధనలు లేకుండా పత్తిని కొనాలి

● రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం



సీసీఐ జిన్నింగ్ పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కనీస మద్దతు ధరతో రైతుల నుంచి నిబంధలను లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జగన్నాథం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీసీఐ కొనుగోలు చేస్తున్న పట్టణ శివారులోని ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ పత్తి పరిశ్రమ వద్ద సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు వీరేష్, రాజు ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ స్లాట్ బుక్ చేసుకున్న పత్తి రైతులు సీసీఐకి విక్రయించుకోవడానికి వస్తే కేవలం ఎకరాకు ఆరు క్వింటాళ్లు మాత్రమే మొదటి విడత తీసుకుంటామని నిబంధలను పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికే రైతులు అధిక వర్షాలకు పెరిగిన ఎరువులు విత్తనాలు కూలీ ధరలతో మద్దతు ధర కూడా గిట్టుబాటు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సీసీఐ ప్రతినిధికి వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ఎల్లప్ప, గోపాల్, పంపన్నగౌడు, తిమ్మయ్య, రమేష్ కుమార్, విజయ్ కుమార్, గంగన్న, అంజిత్ గౌడ్ పాల్గొన్నారు.

'బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు'

ఆస్పరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. సోమవారం ఆస్పరిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానంలో మరిచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు గ్రామాల్లో జీపుజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు రంగస్వామి, రామాంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో వైభవంగా స్వర్ణ పల్లకీ సేవ



స్వర్ణ పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

మంత్రాలయం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం కార్తీక ద్వాదశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాలంకరణ, మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం చేశారు.

తులసి దామోదర వివాహ మహోత్సవం

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు తులసి దామోదర వివాహ మహోత్సవం వైభవంగా చేశారు. సోమవారం రాత్రి ఉత్తన ద్వాదశి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల చేతుల మీదుగా పూర్ణ భోధ పూజ మందిరంలో విశాల వెండి పండపంలో వివాహం చేసి హారతులు ఇచ్చారు. వివిధ రథాలపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

కాషాయ రంగులో పరిమళ ప్రసాదం

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తులకు విక్రయించే పరిమళ ప్రసాదం సోమవారం నుంచి యథాస్థితి కాషాయ రంగులోకి మార్చారు. చాతుర్మాసశాఖావ్రత ఆఖరి ద్విదళవ్రత ప్రారంభాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదేశాలు మేరకు కాషాయ రంగులో తయారుచేసే పరిమళ ప్రసాదాన్ని తెలుపు రంగులోకి మార్చిన విషయం తెలసిందే. మధ్వపీఠం అనుసరించి సాంప్రదాయంగా వస్తున్న ఆచారం ప్రకారం నైవేద్యానికి, అలంకార భోజనానికి గడ్డలు, కూరగాయలు, ఆకుకూరలు, సుగంధ ద్రవ్యాలైన యాలకులు, కేసరి, పచ్చ కర్పూరం నెలరోజుల పాటు నిషేధం ఉన్న విషయం తెలసిందే. ఆదివారం వరకు నెలరోజుల పాటు ఉన్న శాఖావ్రతం పూర్తికావడంతో సోమవారం నుంచి కాషాయ రంగులో ప్రసాదం మార్పు ఉంటుందని మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్ తెలిపారు.

రేపు తుంగా హారతి

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో బుధవారం తుంగా హారతి, లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి తెలిపారు. కార్తీక శుద్ధ పౌర్ణమి శుభ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేస్తారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



ప్రాజెక్టును పరిశీలిస్తున్న హెచ్ఎం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలని హెచ్ఎం నాగభూషణ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం విద్యార్థులకు స్కిల్ కాంపిటీషన్ నిర్వహించారు. వివిధ ప్రాజెక్టులు, వర్కింగ్ మోడల్స్ ప్రాక్టికల్ డె మోస్, టూల్ ఐడెంటిఫికేషన్, కస్టమర్ సర్వీస్, ఎలక్ట్రానిక్ సర్క్యూట్ అసెంబ్లింగ్ వంటి అంశాల్లో విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఇలాంటి స్కిల్ కాంపిటీషన్ వల్ల విద్యార్థులలో సృజనాత్మకత, అత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఈరన్న పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులు: ఎన్ఎంయూ

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్నామని ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఎస్ఎం రఫీక్ ఆరోపించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ముందు సోమవారం ఎన్ఎంయూ సభ్యులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రెండేళ్లయినా కొత్త చార్టు వేయకుండా డ్రైవర్, కండక్టర్లను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఏడీసీ రాజు డిపో మేనేజర్‌కు ఏజెంట్‌లా పని చేస్తూ ఆన్ కాల్ డ్రైవర్లకు అనుకూలంగా ఉంటూ రెగ్యులర్ డ్రైవర్లకు, కండక్టర్లకు విరుద్ధంగా పని చేస్తున్నారని ఆరోపించారు. డిపో యూనియన్ కార్యదర్శి ముస్తాక్, సురేష్, వెంకటేశ్వర్లు, రంగడు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల వరకు పత్తి కొనుగోలు: ఏడీఏ

ఎమ్మిగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పత్తి పండించిన రైతుల నుంచి మొదటి విడతలో 6 క్వింటాళ్లు, రెండో విడతలో 4 క్వింటాళ్లు ఎకరాకు పది క్వింటాళ్ల వరకు సీసీఐ కొనుగోలు చేస్తుందని ఎమ్మిగనూరు ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఏవో శివశంకర్ తెలిపారు. సోమవారం పట్టణం సమీపంలోని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ముందుగా రైతులు ఏడు రోజుల వరకే స్లాట్ బుక్ చేసుకునే ఆస్కారం ఉందన్నారు. ఆ తర్వాత మరో ఏడు రోజులకు మిగతా రోజులు స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండు విడతల్లో 10 క్వింటాళ్లు సీసీఐ కొనుగోలు చేస్తుందన్నారు. ఒకే సారి పది క్వింటాళ్లు కొనుగోలు చేయబోరని తెలిపారు.

ముళ్లపొదల తొలగింపు

గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే ట్యాంక్‌ల చుట్టు ఉన్న ముళ్లపొదలను, పిచ్చిమొక్కలను సోమవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ట్యాంక్ చుట్టూ దోమలు, ఈగలు, విష పురుగులు ఉండకుండా చేసేందుకు గాను ముళ్లపొదలను, పిచ్చి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. అలాగే ఆ ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిన్నరాముడు ప్రమాణం



ప్రమాణ స్వీకారం చేసిన దేవళ్ల చిన్నరాముడు

నందవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నందవరానికి చెందిన టీడీపీ మండల మాజీ కన్వీనర్ దేవళ్ల చిన్నరాముడు సోమవారం విజయవాడలోని ఏపీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల చిన్నరాముడును కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన బీసీ కార్పొరేషన్ కమిషనర్ సత్యనారాయణ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చిన్నరాముడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో నందవరం పీఏసీఎస్ చైర్మన్ గోపాల్, నాయకుడు రామకృష్ణారెడ్డి ఉన్నారు.

శివాలయాల్లో పూజలు

గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం పురస్కరించుకొని ఈశ్వర దేవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోనెగండ్లతో పాటు మండలంలోని గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో సోమవారం భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్లలోని నీలకంఠేశ్వర దేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

నాలుగో రోజు హోమాలు



హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి దంపతులు

ఎమ్మిగనూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో 87వ విశ్వశాంతి మహాయాగంలో భాగంగా హోమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం నాలుగోరోజు రుద్రపాశుపత సహిత మృత్యుంజయ హోమాలు నిర్వాహకులు కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. హోమాల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దంపతులు పాల్గొన్నారు. యాగశాల్లో ఏర్పాటు చేసిన హోమ గుండాల దగ్గర పలువురు భక్తులు హోమాల్లో పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో వీవర్స్ కాలనీ మైదానం భక్తులతో కళకళలాడింది. సాయంత్రం సహస్ర జ్యోతిర్లింగార్చన తదితరు అర్చనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన మండలి సభ్యులు ఆలపించిన భక్తి పాటలు భక్తులను ఎంతగానో అలరించాయి.

ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

నందవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గురుజాల గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం గురుజాలలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయ శాఖ అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధి పనులనుపరిశీలించారు. గోపుర నిర్మాణం, ధ్వజస్తభం, ప్రహరీ నిర్మాణం, ఇతర మౌలిక వసతులపై సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. పుణ్యక్షేత్రాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈవో రాంప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు శివారెడ్డి, రాజేశ్వర రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, వెంకటరాముడు, సంజన్న, కర్ణ, మండల నాయకులు కాశీంవలి, ఈరన్న, సుధీర్ ఉన్నారు.

వైభవంగా శివలింగ ప్రతిష్ఠ

కౌతాళం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కౌతాళంలో సోమవారం రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మ సూత్ర శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేద పండితుల సమక్షంలో ప్రత్యేక హోమాలు చేసి ప్రతిష్ఠించారు. మూడు రోజుల క్రితం దేవాలయానికి చేరిన శివ లింగాన్ని దేవాలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయినది. వివిధ పార్టీల నాయకులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

రేపు లక్ష దీపోత్సవం

కోసిగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయంలో బుధవారం లక్ష దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సాయి రుత్విక్, గట్టు రమేష్, సాయి సేవక్, వై.పాండురంగ తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం నుంచి సాయిబాబాకు కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకం, సాయిబాబా ఉచిత సామూహిక సత్యవ్రతాలు, చందనోత్సవం అనంతరం రాత్రి సాయిబాబా దేవాలయంలో సాయంత్రం 6 గంటలకు లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాలల తనిఖీ

మంత్రాలయం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం, బసాపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో రాఘన్న సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు, విద్య బోధన, మధ్యహ్న భోజనం, పరిశుభ్రత, పరీక్షలనిర్వహణ, ఆయాల పనితీరును పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు హాజరు పట్టికలో ఉండాల్సిన చాలామంది పిల్లలు బడికి రాకపోవడంపై నిఘా ఉంచాలని సూచించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక సూచనలు, సలహాలు చేశారు. హెచ్ఎం రామ్మోహన్, లక్ష్మీకళ, వీరేష్ తదితరులు ఉన్నారు.

'ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టెస్టుల పేరుతో ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న ల్యాబ్‌లపై, అలాగే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మేకల బజారులో డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం వచ్చిన వారికి కనీస వసతులు కల్పించడంలో కూడా యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారి వాహనాలకు పార్కింగ్ స్థలం లేక వాటి నుంచి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని అన్నారు. కార్యక్రమంలో వీరేశ్, రవి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందజేసే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగుచేసే రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. సాగులో ఎవరికైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. అలాగే జిల్లాలో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని చదువుల రామయ్య, ఈద్గా కాలనీల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీ వాసులు సోమవారం ఎంపీడీవో మణిమంజరికి వినతి పత్రం అందజేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ ఈ రెండు కాలనీలలో ఇళ్లు నిర్మించుకొని ఏళ్లు గడుస్తున్నప్పటికీ కాలనీలలో సీసీ రోడ్డు, డ్రైనేజీ లేకపోవడం కారణంగా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. ఈ కాలనీలలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, కనీస సౌకర్యాలు కూడా లేవని చెప్పారు. విద్యుత్ ఓల్టేజీ కారణంగా ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని, తాగునీటి సమస్య విద్యుత్ దీపాల సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. కనీసం చెత్తను తీసుకువెళ్లే వాహనం కూడా ఇక్కడికి రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.